హోలీ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , మార్చి 24 : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ హితమైన రంగులనే వినియోగించి.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ హోలీ పండుగను జరపుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

వాహనాల తనిఖీ ..

బాలానగర్ , మార్చి 24 : ఎన్నికల నియమావళి అమలులోకి రావడతో బాలానగర్ పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. ఆదివారం సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిరోజ్‌గూడ వద్ద కేంద్ర బలగాలతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల నయమావళిని కచ్చితంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. బాలానగర్ పీఎస్ పరిధిలో ప్రతి రోజు ఒక చోట వాహనాల తనిఖీ చేపడుతామని తెలిపారు.

చెలరేగిన మంటలు..

దుండిగల్,మార్చి24: నిజాంపేట్‌లోని వాటర్‌ట్యాంక్ సమీపం, శ్రీరాంకుంట ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ఆదివారం రాత్రి స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు సిగరేట్ తాగి ఆర్పకుండా అక్కడ ఉన్న చెత్తలో పడేయడంతో మంటలు అంటుకుని చెలరేగాయి. గుర్తించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో న్యూ హఫీజ్‌పేట్‌లో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

న్యూ హఫీజ్‌పేట్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

మాదాపూర్, మార్చ్ 24: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాదాపూర్ డీసీపీ వినీత్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం రాత్రి న్యూ హఫీజ్‌పేట్‌లో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. డీసీపీ వినీత్, అడిషనల్ డీసీపీ జయరాంతోపాటు మియాపూర్ ఏసీపీ, ఎస్ హెచ్‌ఓ, చందానగర్, ఆర్‌సీపురం, కొల్లూర్ పోలీసులు సీఐఎస్ఎఫ్ బెటాలియన్‌తో కలిసి హఫీజ్‌పేట్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ... పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు విరుద్ధంగా పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కృషి చేస్తామన్నారు. ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు గురికాకుండా బందోబస్తు చేపట్టనున్నట్లు డీసీసీ చెప్పారు.

3కే రన్‌కు స్పందన..

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరిరావు

దుండిగల్,మార్చి24 : గాజులరామారం డివిజన్, మిథులానగర్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన 3కే రన్/వాక్ పోటీలకు మంచిస్పందన లభించింది. మిథులానగర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్‌ను కార్పొరేటర్ రావులశేషగిరిరావు ప్రారంభించగా.. స్థానిక కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మిథిలా నగర్ వాటర్ ట్యాంక్ నుండి ప్రారంభమైన ఈ రన్.. ప్రగతినగర్ వరకు,తిరిగి అక్కడి నుండి వాటర్ ట్యాంక్ వరకు కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు కొద్దిసేపు నడక/పరిగెత్తడంలో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా 3కే రన్/నడక పోటీల్లో పాల్గొన్న వారికి పలు ఫార్మా, మెడికల్ సంస్థలు వైద్యపరీక్షలు నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను కలిసిన యువకులు

దుండిగల్, మార్చి 24 : ప్రజా అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ఎల్లవేళలా కృషి చేయడమే కాకుండా స్థానికంగా నెలకొన్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలవాసులు శంభీపూర్ కార్యాలయంలో ఆయనను కలిసి,స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలని వినతి

కుత్బుల్లాపూర్,మార్చి 24 : కుత్బుల్లాపూర్ డివిజన్, ముద్దాపురం కాలనీలో రోడ్డు సమస్యపై రెవెన్యూ, హెచ్ఎంటీ శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీలో ఉండే వందలాది కుటుంబాలు శాశ్వతమైన దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. ఆదివారం కాలనీవాసులు రోడ్డు సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేయాలని ఆయనను సంప్రదించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, ఇరు శాఖల అధికారుల జాప్యం, నిర్లక్ష్యం కారణంగానే ఏండ్ల తరబడి సమస్య వెంటాడుతుందన్నారు. ప్రజా అవసరాల కోసం ఉపయోగించాల్సిన స్థలాలపై ఆంక్షలు విధించడం సరైంది కాదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జంగయ్యగౌడ్, సలహాదారులు కృష్ణారెడ్డి, ప్రధాన సలహాదారులు వెంకటేశ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



వైభవంగా మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం

చందానగర్ డివిజన్, గంగారంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం మల్లన్నస్వామికల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటుగా బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, హరీష్‌రావు, మిద్దెల మల్లారెడ్డి, మల్లేశ్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ యాదవ్, గోపి, ఆలయ సభ్యులు పాల్గొన్నారు. – కొండాపూర్, మార్చి 24



హఫీజ్‌పేట్ డివిజన్, హుడా కాలనీలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి లలితా నగరేశ్వరి దేవాలయం మొదటి వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. – మాదాపూర్, మార్చ్ 24

కత్తితో దాడి.. తీవ్రగాయాలు

జీడిమెట్ల, మార్చి 24: ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం...షాపూర్‌నగర్ వివేకానందనగర్ కాలనీకి చెందిన షేక్ శర్వార్ ఈ నెల 23న రాత్రి 10.30 గంటల సమయంలో పాన్ కోసం బయటకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడే పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మల్లారెడ్డి సూరారం వైద్యశాలకు తరలించారు. కాగా బాధితుడి భార్య షహానాబేగం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

' పాతవి రద్దు చేయకుండా కొత్త రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దు'

కొండాపూర్, మార్చి 24 : గచ్చిబౌలిలోని డైమండ్‌హిల్స్ ప్లాట్లకు సంబంధించి పాత రిజిస్ట్రేషన్లను రద్దు చేయకుండా కొత్త రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని హై కోర్టు ఆదేశించినట్లు అసోసియేషన్ సభ్యులు ఆదివారం గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డైమండ్ హిల్స్ లేఅవుట్‌లో 30 ఏండ్ల క్రితం ప్లాట్ల కొనుగోలు చేశామని, చట్టపరంగా కొనుగోలు చేసిన స్థలాలు మావంటూ కొంతమంది ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కొంతమంది పాత రిజిస్ట్రేషన్లు ఉన్నప్పటికీ, డబుల్ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారన్నారు. గతంలో చేసిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయకుండా చేసేకొత్త రిజిస్ట్రేషన్లు చెల్లవని హైకోర్టు తేల్చిచెప్పినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించి ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చేలా సంబంధిత శాఖల అధికారులతోపాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

చేవెళ్ల పార్లమెంట్ అభివృద్ధికి కృషి

కొండాపూర్, మార్చి 24 : చేవెళ్ల పార్లమెంట్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్లలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజితగౌడ్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయండి

మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులను కలిసిన కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజు, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్‌సలీం, తదితరులు

దుండిగల్,మార్చి24 : వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ కార్పొరేటర్, వెంకట శివ రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ ఆగంరాజు ముదిరాజ్, డివిజన్ అనుబంధ కమిటీల సభ్యులు,నాయకులు ఆదివారం మేయర్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులను హిల్‌కౌంటీలోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెల 15న కౌసల్య కాలనీ శ్రీ వెంకట శివ రామాలయంలో నిర్వహించే శ్రీ సీతారామాంజనేయ, శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర శ్రీ శివపంచాయతన శ్రీ లలితా పరమేశ్వరి నవగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవ వేడుకకు,అదే విధంగా 17న నిర్వహించే శ్రీరామ నవమి వేడుకకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కో- ఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, డివిజన్ బీఆర్ఎ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ బద్రీ, అనుబంధ కమిటీల సభ్య లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పట్నం దంపతులకు శుభాకాంక్షలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 24 : మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగుతున్న పట్నం సునీతామహేందర్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమితులైన పట్నం మహేందర్‌రెడ్డి లకు కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు దినేష్‌కుమార్, గంటా శ్రీనివాస్‌గౌడ్‌లు పుష్పగుచ్ఛ అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

అలాగే.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమితులైన పట్నం మహేందర్‌రెడ్డికి కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కర్క పెంటయ్య, ఐఎన్‌టీయూసీ మాజీ అధ్యక్షుడు కర్క నాగరాజులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వెంకన్న, రాచమల్ల శేఖర్‌గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

గెలుపు కోసం పనిచేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 24 : మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని బండి రమేశ్ అన్నాడు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన బీజేపీ మహిళా నాయకులు పలువురు బండి రమేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, గంగా, శివకుమారి, పుష్పారాణి, సంధ్య, బీ-బ్లాక్ అధ్యక్షుడు వేణు, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, పుష్పారెడ్డి, కర్క పెంటయ్య, రాజేందర్, శివచౌదరి, అరుణ్, మాధురి, రాము తదితరులున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

అల్లాపూర్,మార్చి24: అల్లాపూర్ డివిజన్‌లో కొంత మంది కాంగ్రెస్ పేరు చెప్పుకుని వసూళ్లకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ మోయినుద్దీన్ అన్నారు. అదివారం గాయత్రినగర్‌లోని తన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విలేకరుల స మావేశంలో మాట్లాడుతూ..అక్రమ వసూళ్ల బాగోతం కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ దృష్టికి వచ్చిందని,పార్టీని అప్రతిష్ట పాలు చేసే వారి పై కఠినంగా వ్యవహరిస్తామన్నారని తెలిపారు. కాంగ్రెస్ కూకట్‌పల్లి బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వే ణు, విఠల్‌రెడ్డి, నర్సింహా, కనకయ్య, వాజిద్ పాషా, సుంకన్న, వేణు, హమీద్ పటేల్, ఆదిరెడ్డి, కరీం, శ్రీనివాస్‌రెడ్డి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

సందడిగా హోలీ వేడుకలు

హైదర్‌నగర్ డివిజన్‌లోని రిషి మహిళా కళాశాలలో ఆదివారం హోలీ వేడుకలు సందడిగా జరిగాయి. ఆయా విభాగాలకు చెందిన విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పరస్పరం రంగులు చల్లుకుంటూ స్టెప్పులేస్తూ సందడి చేశారు. సహజ రంగులను వినియోగించి పర్యావరణాన్ని సంరక్షించుకోవాలని కళాశాల సిబ్బంది సూచించారు. విద్యార్థినులతో పాటు అధ్యాపకులు సైతం వేడుకల్లో పాల్గొన్నారు. – మియాపూర్ , మార్చి 24

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 24 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ. 11, వంకాయ రూ.18, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 40, కాకరకాయ 36, బీరకాయ 45, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 21, కాలీఫ్లవర్ 18, దొండ 18, చిక్కుడు 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 21, క్యాప్సికం 70, ఆలుగడ్డ 25, కీరా 23, దోసకాయ 17, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 19, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 18, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు (12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠానీ 53, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 180, చింతపండు 140, కరివేపాకు 80 గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



బాలాజీనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజినీతో కార్పొరేటర్ శిరిషాబాబురావు, పార్టీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 24 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబురావు అన్నారు. ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజినీ బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషాబాబురావును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ నగరం ఆదర్శవంతంగా అభివృద్ధి చెందిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేలాది కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, తద్వారా కాలనీలు, బస్తీల్లో దీర్ఘకాలిక సమస్యలన్ని పరిష్కారమయ్యాయన్నారు. గత ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలందరూ బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించారని... పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పార్టీని ఆదరించి భారీ మెజార్టీని అందించాలని ప్రజలను కోరారు. కాలనీలు, బస్తీల్లో ప్రజలను కలుస్తూ కారు గుర్తుకు ఓటేసేలా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేశ్‌చౌదరి, ఉమాకాంత్, భాస్కర్‌రావు, సుశీల్, పృథ్వీ, గోపాల్, లత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన

నిరుద్యోగ యువతనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

దుండిగల్,మార్చి24: అపెక్స్‌ఎస్డీజీ, చౌక్ ప్లాట్ ఫాం, మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కూచారం గ్రామంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పన, అవకాశాలపై అవగాహన కల్పించారు. దాదాపు 100మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధిమార్గాలపై పలు సూచనలు చేసి, వారికి సరైన ఉద్యోగాలు కల్పించేందుకు అప్లికేషన్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ జాబ్ ఫెయిర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పదవ తరగతి, ఇంటర్ చదివిన యువతకు వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చౌక్‌ప్లాట్ ఫాం ఫౌండర్ అభిషేక్ గుప్తా, అపెక్స్ ఎస్డీజీ ఫౌండర్ మెంబర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధీర్ కుమార్, నేచర్ ఐకాన్ యువత, ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. కాగా.. తమ కళాశాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, వారిలో నైపుణ్యతను పెంపొందించేందుకు శిబిరం ఏర్పాటు చేయడంపట్ల కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్‌రావులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉదయ్‌రంజన్ గౌడ్‌ను, వాలంటీర్లను అభినందించారు.

ఆశీర్వదించాలి ..

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 24 : దేశం కోసం, ధర్మం కోసం పాటుపడేది ఒక్క బీజేపీయేనని, రామమందిరాన్ని కట్టించి ప్రజలందరి విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టిన ప్రధాని నరేంద్ర మోదీని మరోసారి ప్రధానమంత్రిని చేసేందుకు ఆశీర్వదించాలని మల్కాగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలాజీనగర్ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో శాంతి భద్రతలను కాపాడుతూ అభివృద్ధి చేస్తున్న బీజేపీని గెలిపించాలని కోరారు.

నేటినుంచి ఆలయ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట, మార్చి 24 : రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహౌసింగ్‌బోర్డు కాలనీ రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 25 నుంచి 30వరకు జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం అంకురార్పణ, గణపతిపూజతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈనెల 26న గణపతి, మృత్యుంజయ హోమాలు, 30న చండీ, శాంతిహోమాలు, మహాకుంభాభిషేకం ఉంటాయి. పరిసరప్రాంత భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సభ్యులు కోరారు.

ఆకట్టుకున్న భరతనాట్యం..

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. ఇందులో భాగంగా ఐశ్వర్య వల్లి తన శిష్య బృందంతో ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో నృత్యకారులు ఆరాధ్య, ప్రవళిక, తన్వీ, శ్రిష్టి, సాహితి, కుసుమితలు పుష్పాంజలి, గరుడగమనా అంశాలను ప్రదర్శించి అలరించారు. – కొండాపూర్, మార్చి 24

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నాగరవికుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్,మార్చి24: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం ...ఏపీకి చెందిన మంజల నాగ రవికుమార్ తన భార్యతో కలిసి నగరానికి వలస వచ్చాడు. సుచిత్ర ప్రాంతంలోని రాఘవేంద్ర కాలనీలో ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తుండగా.. భార్య మెట్రోలో పని చేస్తుంది. అయితే రవికుమార్ ఇటీవలనుంచి ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ అవసరాల కోసం అప్పులు కావడంతో మనస్తాపం చెంది శనివారం ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం భార్య వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కుత్బుల్లాపూర్, మార్చి 24 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు.